# ఆశాజీవి

రచన:
శ్రీ చల్లా సత్యనారాయణరెడ్డి.

ఆ రోజు సాయంత్రం బాగా చీకటి పడుతోంది.

రాయపూర్ పాసింజరు లేటని తెలిసి ప్లాట్ ఫారమ్ మీద అటూ యిటూ తిరుగుతూ పచార్లు చేస్తున్నాను. చేతిలో పత్రికయినా లేదు. సమీపంలో తెలిసిన ముఖం ఒక్కటయినా లేదు. అంత చిన్న స్టేషనులో గంటల తరబడి బండికోసం కాచుక్కూర్చోవటం నిజంగా యిబ్బందిగానే వుంటుంది ఎవరికైనా!

ఆలోచనలు మదిలో దాడి చేస్తున్నాయి.

చేతిలోని సిగరెట్ చివరికంటా కాలి చెయ్యి చురుక్కుమనిపించింది.

యింతలో ఎవరో పిలిచినట్లయు వెనక్కి తిరిగి చూసాను.

'బాబూ! బండి యింకా ఎంత సేపటికొస్తాది' నెమ్మదిగా అడిగాడతను.

వయసు సుమారు డబ్బయి పైదాటి వుంటుందనుకుంటాను. పండు తల, ముడుతలుపడిన శరీరం, చేతి కర్ర మీద గడ్డం ఆన్చి నిల్చున్నాడతను.

ప్రశాంతమయిన ముఖంలో తొంగి చూస్తున్న చిరునవ్వు.

'ఏవూరు వెళతావు తాతా' అన్నాను.

'డొంకినవలస ఎల్లాలి బాబూ.'

'బండి నేటవుద్ది గాబోలు.'

'ఆఁ! ఎంత. పది నిముషాల్లో వచ్చేస్తుంది' అన్నాను ధీమాగా.

అతను సిమ్మెంటు బెంచీమీద చతికిలబడి కూర్చున్నాడు.

దొంటిని దోపుకున్న పొగాకు కాడలు పైకి తీసి, చుట్టలా చుట్టి వెలిగించాడు.

ఆకాశంలోని మబ్బులకేసి చూస్తూ ఏమో ఆలోచిస్తున్నాను నేను.

'ఏవూరు బాబూ! మీది' అన్నాడతను.

'మాది విశాఖపట్నం. మీదేవూరు తాతా' అన్నాను మాట్లాడించాలికదా అని.

'మాదా! నెల్లివలసని యిక్కడికి రెండు క్రోసుల్లుంటాది. యీ వూర్లో మీకు బందుగులున్నారా?'

'లేరు తాతా! పనిమీద వచ్చాను'

'ఏంపని బాబూ! మీకు'

'రైల్వేలో ఉద్యోగం'

'రైల్వేరులోనాండీ! ఎంతకాడికిస్తారు జీతం'

'మూడొందలు'

'అబ్బా'

నాకు నవ్వు వచ్చింది.

'ఏం తాతా! అలా ఆశ్చర్యపోతున్నావు' అన్నాను.

'అబ్బే ఏంకాదు. తమకేమయినా పిల్లలా' అన్నాడు చిన్నగా నవ్వుతూ.

'నాకా! పెళ్ళి కానిదే' అన్నాను ఫకాలున నవ్వుతూ.

'తల్లీ దండ్రీ వున్నారా బాబూ'

'లేదు'

'అప్పసెల్లెల్లూ'

'ఊహూఁ'

'మరి తమరొక్కరేనన్నమాట' అని సాలోచనగా తల పంకించాడతను.

యింతలో గంట గణగణమని మ్రోగటంతో బండి ప్లాట్ ఫారమ్మీదికి వచ్చి ఆగింది.

వున్న కొద్ది ప్రయాణీకులు హడావిడిగా మూటాముల్లె సర్దుకుని లేచారు.

ఆగిన బండిలోంచి ఒక్కరో యిద్దరో దిగారు.

నేను పెట్టె, బెడ్డింగు సర్దుకుని నుంచున్నాను.

అతనూ కంగారుగా లేచి మూట భుజాన వేసుకుని,

'బాబూ! ముసలోణ్ణి. కంత మీరు కూసున్న చోటే ఎక్కించండి మా రాజా! యీ దొమ్మిలో కళ్ళు ఆగపడక బండి ఎక్కడం మహా కష్టమండి' అన్నాడు ప్రాధేయంగా.

నాకు జాలి వేసింది.

తాత, భుజం పట్టుకుని నెమ్మదిగా బండిలో చోటు చేసి కూర్చోబెట్టాను.

నే కూర్చుని సామాను సర్దుకునేలోపునే బండి కదిలిపోయింది.

కిటికీ పక్క సీట్లో కూర్చుని, కిటికీలోంచి ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ సంబరపడుతున్నాను.

తాత చుట్ట కొస అంటించి పొగ వదులుతూ ఏమో ఆలోచిస్తున్నాడు.

కిటికీలోంచి చల్లని గాలి రివ్వున వీస్తోంది.

మబ్బులు కమ్మిన ఆకాశం సంధ్య వెలుగులు పులుముకుని కొత్త రంగులు తొడుక్కుంది.

బండి క్రమంగా వేగం పుంజుకుంది.

బండితో పోటీపడి చెట్లూ, గట్లూ, పుట్టలూ అన్నీ వెనక్కి సాగిపోతున్నాయి. దూరాన కొండలు తమ చుట్టూ గుండ్రంగా తిరుగుతున్నట్లవుపిస్తోంది. పంటచేల గట్టుమీద పక్షుల కలరవం, ఒడ్డు వొరుసుకుంటూ ప్రవహించే పిల్ల కాలువల రస సంగీతం హృదయానికి హాయినిస్తున్నాయ్!

బండి చక్రాల హోరు ఆలోచనల్ని జోకొడుతున్నట్లుంది!!

యింతసేపూ తాత నన్నే గమనిస్తుండటం చూస్తే నాకు అతనితో మాట్లాడాలని అనిపించింది.

'ఏం పనిమీద వెడుతున్నావు తాతా' అన్నాను.

'మా అమ్మిని సూడ్డానికి ఎల్తున్నాను బాబూ! దానికి కాన జబ్బు సేసిందట'

'అహా! పాపం'

'మీ అల్లుడేం చేస్తున్నాడు'

'ఆడా! ఆడేం చేస్తాడండి. పనికిమాలిన ఎదవ. తప్పు తాగి వూరుమీద తిరుగుతాడు. పేకాట, జూదం ఆడి అచ్చణాలు'

'మరి మీ అమ్మాయి ఎలా కాపురం చేయగల్గుతుంది.'

'చెయ్యకేం చేస్తుంది మరాజా!

ఎవరిరాత ఎలాగుందో! అలాజరక్క తప్పుతుందా. గరిగిగోవు లాటి దండి బిడ్డ. కన్న కడుపు కట్టుకోతేము. కని, పెంచిన మమకారం అటువంటిది. నేనే ఎవసాయం మీద వచ్చిన గింజాగట్రా యిస్తుంటాను పిల్లకు కింత గంజి కాసిమ్మని. అడికి స్థిరం ఒచ్చింది కాదండి 'ఎదవ నాయాల' అని, తాత కన్నీళ్ళొత్తుకున్నాడు.

'నీకేమాత్రం భూమి వుంది తాతా' అన్నాను.

'అరెకర్తాల మాగాణి బాబూ'

'కొడుకుల్లేరా'

'పుట్టుకదోనే సచ్చిపోయిండు బాబూ! ఆడిమీద బెంగెట్టుకుని మాయాడది కాస్త గుటుక్కుమనింది. నేనే యింత ఎవసాయమూ సేస్తుంటా'

'పాపం! నీకెవరు వండి పెడతారు'

'ఎవరున్నారు బాబూ! వండి పెట్టడానికి? నేనే పొలం ఎల్లి మాపులికి వచ్చినాక, యింత గంజి కాసుకుంటాను. వున్న ఒక కూతురూ అక్కడ సుకంలేక సచ్చి పడుంది బాబూ! పువ్వునాగ పెంచినాను. బగమంతుడు దాని బతుకు తెల్లారనిచ్చినాడు కాదు'

అతని మాటలు వింటుంటే నా హృదయం ద్రవించి పోయింది.

'విచారించకు తాతా! ఎప్పటికయినా అతనిలో మార్పు వస్తుంది. పోనీ...మీ అమ్మాయిని చేరదీసి నీ దగ్గిరే వుంచకపోయావా?'

'అలాగే చేసాను. కాని అడికి మరీ పట్టపగ్గాలు లేకపోయాయి. యిచ్చలవిడిగా తిరిగేవోడు. అదుండబట్టి ఆడినో కంట కనిపెడతా వుంటాది'.

'సరే మీ అల్లుడికి చెప్పిచూశావా?'

'చెప్పటమా! హుం!! ఆడికి చెప్పి చెప్పి నా గొంతు పడిపోయింది. మంచి మనిషికి ఒక్క మాటే బాబూ! పదిసార్లు చెప్పవల్చిన అవసరంలేదు'

'నిజమే. నీ ఆస్థి ఎర చూపించి వ్యవసాయం పనిలోకి దించకపోయావా? అలా శ్రమకి అలవాటుపడితే, కష్ట నష్టాల్ని అర్థం చేసుకుని, పిల్లల ముఖం చూసయినా బాగుపడతాడేమో' అని, ఆశగా చూసాను అతని ముఖం లోకి.

'అవును బాబూ! యికమీదట అలాగే చెయ్యాలి. నీ కడుపు చల్లగా ఎంత చక్కగా చెప్పావు. సిన్నోడివైనా బుద్ధిమంతుడివి. ఏయమ్మ వస్తాదో గాని దాని బతుకు సుకంగా ఎల్లిపోతాది' అని నిండుగా నవ్వాడు తాత.

ఆ నవ్వు అతని ఆశీర్వచనమని తెలిసి నా హృదయం నిండుగా ప్రేమతో పొంగిపోయింది.

'ఏం తాతా! నన్ను పెంచుకో కూడదూ! నిన్ను సుకంగా చూసుకుంటాను' అన్నాను.

'అంతకన్నానా! బాబూ! దేవుడు సల్లగా వుండాలి కాని' అని సీటుకి చారిగిలబడి కూర్చున్నాడు అతను.

(తరువాయి 17వ పేజీలో)

భయంతో ఇద్దరికీ మంచి చెడ్డలు యోచించే శక్తి అదృశ్యమైపోయింది. ఒక్కసారిగా భూమ్యాకాశాలు దద్దరిల్లేలా, ఫెళఫెళార్భాటంతో ఎక్కడో పిడుగు పడింది. హృదయ భయంకరమైన ఆ శబ్దానికి ఇద్దరూ కూడా హడలిపోయారు. గాఢాంధకారం వికటాట్టహాసం చేస్తూంటే ఒకర్ని ఒకరు కౌగలించుకొన్నారు. ఆ భయంకర కాళరాత్రిలో అంతకన్నా వారికి గత్యంతరం లేకపోయింది. భయం పోవడానికి – ఒక గంట గడిచింది – వర్షం వెలిసింది – ఆకాశం తేటపడింది – నక్షత్రాలు మినుకుమినుకుమంటున్నాయి. అప్పటికి వచ్చాడు ఆ రిక్షావాలా రిపేరు చేసేవాణ్ణి తీసుకొని 'బాబూ!' అని రిక్షావాని పిలుపుతో ఏదో క్రొత్త లోకంలోంచి గాఢ స్వప్నంలోంచి మేల్కొన్నట్లు ఉలిక్కిపడ్డారు భవాని–శర్మను.

రిక్షావాలా టైర్ బాగుచేయించుకొంటున్నాడు. శర్మ, భవానీ ఒకరి ముఖాల్లోకి ఒకరు ఆ గ్రుడ్డి వెన్నెల్లో చూచుకొంటూంటే తళుక్కుమంటూ ఒక్క మెరుపు మెరిసింది. ఇద్దరూ ఒకర్ని ఒకరు చూచుకు సిగ్గుపడ్డారు. ఎవరి ఆలోచనలో వారున్నారు.

ఉదారత్వంలో, సహృదయత్వంలో, ఆత్మ విశాలత్వంలో, పావనత్వంలో, అందంలో, విద్యలో, తేజస్సులో, అన్నింటిలో నూతనకంటే అధికుడైన ఈ శర్మ తనకు భర్తగా లభిస్తే ఇంతకన్నా జీవిత సాఫల్యం ఇంకేం కావాలి అని పరవశత్వం పొందుతోంది భవాని శర్మను చూస్తూ.

సౌశీల్యము, నిర్మలత్వము, పావన హృదయము, అమాయిక, దయాపూరిత హృదయ, దోమకుకూడా ద్రోహం చెయ్యని నిష్కల్మషమైనది. తన జీవితాన్ని సఫలం చెయ్యగల ఈ సహజ సౌందర్యవతి భవాని తనకు భార్యగా లభిస్తే తన జీవితం సార్థకమై స్వర్గీయానందాన్ని పొందగలనని ఊహించుకు ఉద్రిక్తుడౌతున్నాడు శర్మ.

అంతలో రిపేరు చెయ్యడం పూర్తయి 'రిక్షా పోనివ్వనా బాబూ!' అన్నాడు రిక్షావాలా.

'బాబూ! ఇయ్యాల లేచిం రోజు మంచిది కాదండి బాబూ! లేకపోతే ఇన్ని అవస్తాలు ... తమరిని కట్టిబెట్టాను బాబూ! నేనెంత నేపో బ్రతిమలాడితేగాని రానన్నాడు బాబూ ఆ బాగుచేసే ఆయన' అంటూ ఏమిటో చెప్పుకొంటూ పోతున్నాడు ఆ రిక్షావాడు.

కాని రిక్షాలో కూర్చున్నవారికి అసలీమాటలే వినిపించడంలేదు.

వర్షపు చిహ్నాలు అన్నీ పూర్తిగా తగ్గి అతి రమణీయకమైన ప్రకృతి తన అందాన్ని చూపిస్తూంటే; వారిద్దరి మనస్సులు ఉద్రేకంతో, ఉత్సాహంతో ఉప్పొంగిపోతున్నారు. ఆ రిక్షాలో వారిద్దరి ఉచ్ఛ్వాస, నిశ్వాసలు తప్ప నోటంట మాటలుమాత్రం లేవు.

'భవానీ! అదుగో ఆ చంద్రుడు మనల్ని చూస్తున్నాడు కదూ?' అంటూ భవాని ముఖంలోకి చూస్తూ నవ్వుతూ అడిగాడు.

భవానీకి చంద్రుణ్ణి చూస్తూంటే ఒళ్లంతా గిలిగింతలు పెట్టినట్లయి పరవశత్వంతో కనురెప్పలు బరువుగా వాలిపోయాయి.

ఉత్సాహోద్రేకంతో మైమరచి దగ్గరగా తీసుకున్నాడు భవానీని శర్మ. దోబూచులాడే చంద్రుడు.

(సశేషం)

---

(12వ పేజీ తరువాయి)

బండి క్రమంగా స్పీడు తగ్గి అవుటర్ సిగ్నల్ని సమీపించింది.

యింక కొద్ది క్షణాల్లో 'తాత–నేనూ వేరయిపోతాం' అన్న ఆలోచన రాగానే–ఒక్కసారి నా గుండె ఝల్లు మన్నట్లయింది!

అతి తక్కువ పరిచయంలోనే యింత ఆత్మీయతని పొందిన ఎవరు మాత్రం అలా ఒకరినింకొకరు దూరం చేసుకోగలరు. కాని పరిస్థితులూ, విధి తప్పవుకదా! ఎవరికైనా!!...

బండి ఆగడంతో మూటముల్లె సర్దుకుని తాత లేచి నిల్చున్నాడు.

అతణ్ణి సాగనంపటానికి నేనూ లేచాను.

'వస్తాను బాబూ! బతికుంటే ... ఎప్పుడో ... ఎక్కడో...' అని తాత వాక్యం పూర్తికాక ముందే అతని గొంతు బొంగురు పోయింది.

'మనం తప్పక కలుస్తాం తాతా' అన్నాను ఆవేదనగా.

తాత నెమ్మదిగా దిగి ప్లాట్ ఫారమ్ మీద చీకటిలో కలిసి పోయాడు.

విధిలేక కదిలిన రైలు బండి 'కూ,' మని కూత కూసింది.

నా కళ్ళలో తాత రూపం నిల్చిపోయింది.